

శాతాపురంలో దేవాదుల 4ఎల్ కాల్వను పరిశీలిస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

## కాంగ్రెస్ పాలనలోనే రైతుల కష్టాలు

- కేసీఆర్ పాలనలో వేసవిలోనూ చెరువులకు మత్తళ్లు
- మూడు రోజుల్లో నీళ్లు రాకుంటే రైతులతో కలిసి ధర్నా
- ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి, ఫిబ్రవరి 23: కాంగ్రెస్ పాలనలోనే రైతులకు కష్టాలు మొదలయ్యాయని, ఆ పార్టీ వచ్చి కరువును తెచ్చిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మండిపడ్డారు. ఆదివారం జనగామ జిల్లా పాలకుర్తి మండలం శాతాపురంలో దేవాదుల 4ఎల్ కాల్వ ద్వారా గోదావరి జలాలు రావడం లేవని రైతులు ఎర్రబెల్లి దృష్టికి తీసుకురాగా పరిశీలించారు. దేవాదుల శాఖ ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి మూడు రోజుల్లో నీళ్లు వదలాలని సూచించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పాలనలో చెరువులు మత్తళ్లు దూకాయని గుర్తుచేశారు. ప్రస్తుత సర్కారు గోదావరి జలాలు విడుదల చేయకపోవడంతో 1000 ఎకరాల్లో వరి పొలం ఎండుతున్నదన్నారు. మూడు రోజుల్లో గోదావరి జలాలు విడుదల చేయకుంటే రైతులతో కలిసి ధర్నా చేస్తానని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు వరి వేయవద్దు అని చెప్పడం విడ్డూరంగా ఉన్నదన్నారు. గోదావరి జలాలు విడుదల చేయకపోవడంతో బోర్లు, బావుల్లో భూ గర్భ జలాలు అడుగంటడడంతో పొలాలు ఎండిపోతున్నాయని చెప్పారు.



పనులను అడ్డుకుంటున్న లక్ష్మణాపురం భూ నిర్వాసితులు

## ప్రాజెక్టు ముంపు బాధితుల ఆందోళన

- ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పరిహారం చెల్లించాలని డిమాండ్
- లక్ష్మణాపురంలో ప్రాజెక్టు పనుల అడ్డగింత

మర్రిగూడ(నాంపల్లి), ఫిబ్రవరి 23 : ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద మంజూరైన నష్టపరిహారాన్ని తక్షణమే చెల్లించాలని భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం లక్ష్మణాపురం ప్రాజెక్టు ముంపు బాధితులు ఆదివారం ప్రాజెక్టు పనులను అడ్డుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ 2017లో చనిపోయిన వారితోపాటు 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సర్వే నంబర్ 327లో భూములు కోల్పోయిన వారికి కూడా నష్టపరిహారం ఇవ్వలేదని ఆరోపించారు. భూ నిర్వాసితులందరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, నష్టపరిహారం చెల్లించిన తరువాతే పనులు కొనసాగించాలని డిమాండ్ చేశారు. పరిహారం చెల్లించకపోతే నిరవధికంగా పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు.



## ఎండిన పంటలు పశువుల పాలు

### నీళ్లు లేక కండ్ల ముందే ఎండుతున్న పంటలు

### జనగామ జిల్లా దేవరుప్పులలో రైతుల ఆందోళన

దేవరుప్పుల, ఫిబ్రవరి 23: జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలో నీళ్లు లేక యాసంగి వరి చేన్లు నెర్రెలు బారుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటి బోర్లు పోయకపోగా, బావులు ఎండిపోయాయి. వేల రూపాయలు ఖర్చు పెట్టి వేసిన నాట్లు ఎండుతుండటంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. చేసేదేమీ లేక ఒక్కో మడి వదిలి బర్లు మేపుతున్నారు. ఇంకొందరు రైతులు ఆశలు వదులుకుని గొర్రెల కాపరులకు వరి చేన్లు అమ్ముకుంటున్నారు. పదేళ్లుగా యాసంగి పంటలు ఎండిన దాఖలాలు లేకపోవడంతో అదే నమ్మకంతో నాట్లు పెట్టిన రైతులు నీరు లేక పంటలు ఎండుతుండటంతో తల్లడిల్లిపోతున్నారు.

## రైతులపై అటవీ అధికారుల దాడి దారుణం

- మానవ హక్కుల వేదిక నేత తిరుపతయ్య ఆగ్రహం

కృష్ణ కాలనీ, ఫిబ్రవరి 23: జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి మండలంలోని ఆజంనగర్‌లో అటవీ అధికారులు రైతులపై విచక్షణారహితంగా దాడి చేయడం దారుణమని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ తిరుపతయ్య అన్నారు. ఇందుకు బాధ్యులైన అధికారులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 35 ఏండ్లుగా పోడు భూమిని సాగు చేసుకుంటున్న 11 కుటుంబాల రైతులపై అటవీ అధికారులు మూకుమ్మడిగా దాడి చేసి గాయపరచగా, ఆ కుటుంబాలను ఆదివారం మానవ హక్కుల వేదిక బృందం పరామర్శించింది. గ్రామస్థులతో మాట్లాడి వాస్తవాలను సేకరించింది. వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య మాట్లాడుతూ.. 35 సంవత్సరాలుగా గుంట భూమిలేని నిరుపేద రైతులు పోడు సాగు చేసుకుంటుండగా సుమారు 150 మంది అటవీ శాఖ పోలీసులు వారిపై దాడి చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో రైతులకు అరిగోస

### నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

### మునుకుట్లలో ఎండిపోయిన పంట పొలాల పరిశీలన

కట్టంగూర్, ఫిబ్రవరి 23 : కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు అరిగోస పడుతున్నారని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆందోళన వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం మునుకుంట్లలో ఆదివారం ఆయన రైతు బీమన బోయిన భిక్షంకు చెందిన ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా చిరుమర్తి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 14 నెలల్లో రైతులు దయనీయ పరిస్థితులను ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. సకాలంలో కరెంట్ ఇవ్వకపోవడం, కింది ప్రాంతాలకు ఏఎమ్మార్పీ, మూసీ నుంచి సాగునీరు విడుదల చేయకపోవడంతో పంట పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో సాగునీరు లేక, కరెంట్ సకాలంలో రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కండ్ల ముందే ఎండిపోతున్న పంట పొలాలను రైతులు కాపాడుకోలేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం ఎంపిక చేసిన పైలట్ ప్రాజెక్టు గ్రామాల్లో కూడా సగం మంది రైతులకు రైతుభరోసా ఇవ్వలేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలో పాడి పంటలతో సంతోషంగా ఉన్న రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బీడు భూములుగా మార్చిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతులు తమ పంటలను తామే కాల్చుకునే పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రతి రైతు ఎకరానికి రూ.35 వేల చొప్పున పెట్టుబడులు పెట్టి కరువుతో తీవ్రంగా నష్టపోయారని ప్రభుత్వం ఎకరానికి రూ.50 వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.



మునుకుంట్లలో ఎండిపోయిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

## మనస్తాపంతో ఆగిన రైతు గుండె

- హనుమకొండలో విషాదం



కడుదల విజేందర్ (ఫైల్)

ఆత్మకూరు, ఫిబ్రవరి 23: దిగుబడులు రాక.. చేసిన అప్పులు తీర్చే పరిస్థితి లేక తీవ్రమనస్తాపానికి గురయ్యాడు ఓ రైతు. ఈ క్రమంలో ఒత్తిడికి గురైన ఆయన ఆదివారం గుండెపోటుతో మరణించాడు. ఈ విషాదకర ఘటన హనుమకొండ జిల్లాలో చోటుచేసుకున్నది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు మండలం అక్కంపేటకు చెందిన రైతు కడుదల విజేందర్ (36)కు రెండెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. అందులో పత్తి, మక్కజొన్న వేశాడు. పెట్టుబడి కోసం రూ.4 లక్షల అప్పు చేశాడు. పంట దిగుబడి రాకపోవడంతో విజేందర్ మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం ఒక్కసారిగా ఛాతిలో నొప్పి వస్తుందని చెప్పడంతో చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు ఎంజీఎం దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

## కేంద్రం నుంచి యూరియా రావట్లేదు

- ఆందోళన వద్దు: తుమ్మల

హైదరాబాద్, ఫిబ్రవరి 23(నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం నుంచి కోటా మేరకు యూరియా రావడం లేదని, అందుకే రాష్ట్రంలో కొరత ఏర్పడిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటి వరకు కేంద్రం నుంచి 8.54 లక్షల టన్నుల యూరియా రావాల్సి ఉండగా 6.81 లక్షల టన్నులు మాత్రమే వచ్చినట్టు పేర్కొన్నారు. 1.73 లక్షల టన్నులు తక్కువగా వచ్చినట్టు వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఆదివారం యూరియా పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. కేంద్రం నుంచి యూరియా రాకపోయినా ఆందోళన వద్దని, మార్క్‌ఫెడ్ వద్ద ఉన్న నిల్వలను జిల్లాలకు సరఫరా చేస్తున్నామని, రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గతంతో పోల్చితే యూరియా వినియోగం కూడా పెరిగిందని స్పష్టం చేశారు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.